క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహాగణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర, ధ్వజ,శిఖర, కలశ, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్టోత్సాలు గావించి 41రోజులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ నిర్వాహకులు వేద పండితులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో కొలువైన దేవతామూర్తులకు అభిషేకం, ప్రత్యేక అలంకారం, హోమాలు జరిపించారు. కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలి


వైద్యురాలిని సన్మానిస్తున్న దృశ్యం


బొమ్మలసత్రం: మహిళలు కష్టాలను అధిగమించి ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ జాస్మిన్‌సుల్తానా అన్నారు. గురువారం స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని మంచి ఉన్నత స్థానాలు చేరుకోవాలని కోరారు.ప్రస్తుతం అన్ని రంగాల్లో స్త్రీలు వృత్తి పరంగా రానిస్తున్నారని, భవిష్యత్‌లో ప్రతి రంగంలో ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ సాయిప్రణీత్

నంద్యాల(సిటీ): క్యాన్సర్ మహమ్మారి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ మహమ్మారిపై ఉదయానంద ఆసుపత్రి డాక్టర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాయి ప్రణీత్ మాట్లాడుతూ క్యాన్సర్ కారకాలైన ప్లాస్టిక్‌ను నియంత్రిస్తే క్యాన్సర్ బారిన పడే అవకాశాలు తగ్గుతాయన్నారు. అలాగే మానసిక నియంత్రణతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. కొన్ని క్యాన్సర్లు వంశపారంపర్యంగా వస్తే మరికొన్ని జీవనశైలి ఆధారంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం అధునాతన చికిత్సలు, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే చికిత్స సులభమేనన్నారు. డాక్టర్ ప్రసన్న కుమార్, కో-ఆర్డినేటర్ పార్వతి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త గంగన్న, ఫైజుల్లా పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం


పోలీసులను సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలం బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వర్తించిన పోలీసులను గురువారం సన్మానించారు. అహోబిలం మఠం జీపీఏ సంపత్, ముద్రకర్త వేణుగోపాలన్ దిగువ అహోబిలం దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారులను స్వామివారి శేషవస్త్రాంతో సన్మానించి, నవనారసింహ స్వామి జ్ఞాపిక, స్వామి ప్రసాదంతో పాటు ఆశ్వీరచనాలు అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


నాగేంద్ర (ఫైల్)

రుద్రవరం: మండలంలోని పందిర్లపల్లె గ్రామానికి చెందిన ఉల్లెడ నాగేంద్ర (24) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. జనవరి 16న పచ్చి మిరప కాయలు విక్రయించేందుకని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని తండ్రి ఉల్లెడ పెద్ద మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

మహానందిలో పెళ్లి సందడి

మహానంది: క్షేత్రంలో గురువారం పెళ్లిసందడి నెలకొంది. శుభ ముహూర్తాలు ఉండటంతో పది పెళ్లిళ్ల వరకు జరిగాయి. టీటీడీ కల్యాణ మండపంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి కుమారుడి వివాహానికి ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల నాని హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పాఠశాలలకు మహర్దశ

- రూ. 5.20 కోట్లతో చురుగ్గా నాడు నేడు పనులు
- రూపుదిద్దుకోనున్న సర్కారు బడులు


మాయలూరులో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు


ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో చురుగ్గా సాగుతున్న టాయిలెట్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు


ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో ఫ్లోరింగ్ వేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి పేద విద్యార్థుల ఉన్నతంగా విద్యనందించేందుకు ప్రభుత్వం మన బడి-నాడు -నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మండలంలోని పాఠశాలలకు రెండో విడతలో భాగంగా రూ. 5.20 కోట్లు మంజూరు చేసింది. ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ప్రహరీ నిర్మాణానికి రూ.75 లక్షలు, హరివరం ఉన్నత పాఠశాలలో వసతులు, ప్రహరీ, 2 అదనపు తరగతి గదులు, ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాల కోసం రూ.1.10 కోట్లు, మాయలూరు ఉన్నత పాఠశాలలో వసతులు,నాలుగు అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి రూ.1.22 కోట్లు,బోడెమ్మనూరు ఉన్నత పాఠశాలలో వసతులు, ప్రహరీ నిర్మాణానికి రూ.67 లక్షలు, కొండుపల్లె ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక రెగ్యులర్ పాఠశాలలో వసతులకు రూ.54 లక్షలు, పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె, రూపనగుడి ప్రాథమిక పాఠశాలల్లో సౌకర్యాల కోసం ఒక్కొక్క పాఠశాలకు రూ.12 లక్షల చొప్పున, ఆర్.జంబులదిన్నెలో ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 20 లక్షలు కేటాయించినట్లు ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అలాగే పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రూ.12 లక్షలు చొప్పున మంజూరు చేశారని చెప్పారు. ఆయా పాఠశాలల్లో అదనపు గదులు, మరుగుదొడ్లు, టాయిలెట్లు, తరగతి గదుల్లో విద్యార్థులకు సంబంధించిన 9 రకాల అభివృద్ధి పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ స్పష్టం చేశారు.

పన్నులు వసూలు చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలోనున్న గృహాలకు సంబంధించిన పన్నులను వెంటనే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం ఇటీవల మున్సిపాలిటీలో కలిసిన గ్రా మ వార్డు సచివాలయాల సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామాలైన రైతునగరం,పొన్నాపురం, ఊడుమాల్పురం గ్రామాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో కలిపి ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల పర్యవేక్షణ నంద్యాల మున్సిపల్ అధికారులకు కేటాయించారని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, ఆర్‌ఓ వరప్రసాద్,మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిలు రూ.1.66 కోట్లు


వైకేపీ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్

ఉయ్యాలవాడ : సంజామల, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రూ.1.66 కోట్లు బకాయిలు ఉన్నాయని స్త్రీనిధి మేనేజర్ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మండలాల పరిధిలోని 93 గ్రామైక్య సంఘాల ద్వారా 315 గ్రూపుల్లోని 3,150 మంది మహిళలు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందారన్నారు. రూ.1.66 కోట్ల బకాయి ఈ నెల 15 నుంచి 20వ తేదీలోపు 11 శాతం వడ్డీతో రికవరీ చేసేలా ఆయా మండలాల ఏపీఎంలు, సిబ్బందిని ఆదేశించామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం స్త్రీనిధి ద్వారా రూ. 22 కోట్లు పొదుపు నిర్వహణలో లావాదేవీలు సక్రమంగా నిర్వహిస్తున్న గ్రూపులను గుర్తించి రూ. 9 కోట్లు 450 గ్రూపుల్లోని 4,500 మంది పొదుపు మహిళలకు అందజేశామని తెలిపారు. ఉయ్యాలవాడ మండలంలో వీఓఏల నిర్లక్ష్యంతో స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రూ.56 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శేఖర్, సీసీ గంగన్న పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండలి విప్ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కోటపాడులో గత నెల 28న శ్రీ చెన్నకేశవస్వామి, వీరభద్ర స్వామి ఆలయాల ధ్వజ ప్రతిష్ఠోత్సవాలు జరిగాయి. ఈ మేరకు గురువారం 45 రోజుల పండుగ జరిగింది. కార్యక్రమానికి హాజరైన వారు ధ్వజస్తంభం, స్వామి వార్లకు పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 42 లక్షలు మంజూరు చేయగా ఆలయాల విస్తరణ పనులు, నూతన ధ్వజ స్థంభాలు ఏర్పాటు చేశారని చెప్పారు. అనంతరం చైర్మన్లు వంకదార బాబు, గోపాలరెడ్డి వారిని సన్మానించారు. అలాగే ఎస్సీ కాలనీలలో నూతనంగా నిర్మించిన శ్రీ రామ, చెన్న కేశవస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్టి, ఈఓ వేణునాథ రెడ్డి, సర్పంచు దూదేకుల గుర్రప్ప, ఎంపీపీ నాయక్ వసీం, పార్టీ మండల నాయకుడు ఇందూరి ప్రతాప రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్ పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అభ్యర్థించారు. గురువారం పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేయాలని కోరారు.ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, నాయకులు సింగం వెంకటేశ్వర రెడ్డి, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు అమీర్ బాషా పాల్గొన్నారు.

చాగలమర్రిలో..


వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గురువారం మండల కేంద్రం చాగలమర్రిలో మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపీటీసీ ఫయాజ్, ఉప సర్పంచ్ షేక్ సుహేల్, కుమార్‌రెడ్డి తదితరులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు.

దొర్నిపాడు: పశ్చిమరాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి, దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి బుర్రారెడ్డిపల్లె గ్రామంలో గురువారం ప్రచారం చేశారు. సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీప్రతి ప్రసాద్, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్రీరాములు, ప్రతాప్‌రెడ్డి, భూమా రామకృష్ణారెడ్డి, మైనుద్దీన్, బాషా పాల్గొన్నారు.

రుద్రవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపిద్దామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఆలమూరు, చిత్రేనిపల్లె,మందలూరు గ్రామాల్లో గురువారం ఆయన పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ సర్పంచులు ప్రసాదరెడ్డి,చంద్ర, హరినారాయణ, నాయకులు నాగేష్,సత్యనారాయణ,బ్రహ్మం,మాధవ ఉన్నారు.

వైభవంగా ప్రహ్లాదవరదుడి తెప్పోత్సవం


కోనేరులో పూలజందుకుంటున్న ఉత్సవమూర్తులు


కోనేరులో విహరిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: భూదేవి, లక్ష్మీసమేతుడైన శ్రీ ప్రహ్లాదవరద స్వామి వార్ల తెప్పోత్సవం గురువారం రాత్రి వైభవంగా కొనసాగింది. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి మాడ వీధుల్లో ఊరేగింపుగా కోనేటి వరకు తోడ్కొని వచ్చి తెప్పపై అధిష్టింపజేయగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన తెప్పపై విహరించారు. సుమారు గంటపాటు కార్యక్రమం జరిగింది. భక్తులు కోనేటి చుట్టూ కార్యక్రమాన్ని వీక్షించి తరించారు.

గరుడ వాహనంపై విహరించిన నారసింహుడు


గరుడ వాహనంపై కొలువైన యోగానంద లక్ష్మీనరసింహస్వామి

ఆళ్లగడ్డ: రామతీర్థ పుట్టాలమ్మ పరుశురామలింగేశ్వరస్వామి క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి గరుడ వాహనంపై అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం మూల మూర్తులు స్వామి అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూనీలా సమేత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వాము వార్లను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం జరిపించి శ్రీ సుదర్శన హోమం చేపట్టి పూర్ణాహుతి నిచ్చారు. అనంతరం పట్టు పీతాంబరాలతో ముస్తాబు చేసి విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు.

మధుసూదన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్, పీపీ నాగిరెడ్డి

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మధుసూదన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా స్వగృహంలో ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు లాంఛనమేనని, అలాగని నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పోటీ చేయడానికి ధైర్యం లేక దొడ్డిదారిలో నామినేషన్ వేయించారని ఎద్దేవా చేశారు. జిల్లాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ మధుసూదన్‌ను సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా ఓటు వేయాలన్నారు. అలాగే పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డిని కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, జెడ్పీటీసీలు పి.రాజేశ్వరమ్మ, గోకుల్‌రెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమాన్, నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు


నంద్యాల: పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల 3,99,942 మంది పిల్లలకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సంవత్సరంపై బడిన పిల్లలందరూ మాత్రలు మింగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ విభాగం అనుసంధానంతో కచ్చితంగా నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫరుల్ల పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మైక్రో పరిశీలకులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నిర్వహించిన మైక్రో పరిశీలకుల శిక్షణా తరగతుల్లో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియను సూక్ష్మస్థాయిలో పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

మాతా శిశు ఆరోగ్యానికి భరోసా


ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి


మాయలూరు పీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : ప్రజాఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాతా శిశు ఆరోగ్యానికి సైతం భరోసా కల్పిస్తోంది. గురువారం ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా మాయలూరు, ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 60 మంది గర్భిణులకు వైద్యాధికారులు రాబర్ట్ కెనడీ, రమేష్‌చంద్ర బాలాజీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి సుఖ ప్రసవాలు జరిపించేందుకు, మాతా శిశు మరణాల నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, కృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జిల్లెల్ల గ్రామానికి చెందిన మోహన్, మధు కుటుంబాలను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి గురువారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వెళ్లి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మోహన్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన మధును చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్‌కు భార్య, కుమారుడు ఉండగా మధుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు.